జీలో ప్రవర్తించం: యివాళ దీపం ఆరిపోయింది: మనం కోపంతో గంతులు వేస్తున్నాం.

ఇంత జరిగిన తర్వాత కూడా, మారిసన్ యింకా వాస్తవికతను ఎదుర్కొందికి నిరాకరిస్తున్నాడనే మా నమ్మకం. మిలిటరీ చర్యకు ఎక్కడా ఆస్కారంలేదు. ఇక గత్యంతరం ఏమిటి? డాక్టర్ మొసాదిక్ విధిస్తూన్న షరతులను ఆమోదించి, అతడు యిస్తానంటూన్న లాభంలో 25% వాటా కంటే ఎక్కువ లాభిస్తుందేమో సంప్రదించి చూడడం. దానికిబదులు మన సంప్రదింపుల సంఘం వెనక్కి రప్పించబడింది. అబదాన్‌లో నూనె తవ్వడం ఆగిపోయినా సరే, మన ఓడలు ఖాళీగా వెనక్కి వచ్చేసినా సరే, సంప్రదింపులు సాగించడానికి మనం సుముఖంగా లేమన్నమాట. ఈ చర్యను ఆమోదించేవాళ్లు ఒకటి జ్ఞాపకం ఉంచుకోవలసి ఉంటుంది: 1930 దశాబ్దంలో మెక్సికో ప్రభుత్వం అక్కడ ఉన్న బ్రిటిష్, అమెరికన్ నూనె గనులను స్వాధీనం చేసుకుంది. అప్పుడూ మెక్సికో పట్ల యిదే వైఖరి అవలంబింపబడింది. అనంతరం తొమ్మిదిసంవత్సరాలపాటు మెక్సికో నుండి ఒక్క చుక్క కూడా నూనె ఎగుమతి కాలేదు. ద్వితీయ ప్రపంచయుద్ధం ముగిసిన తర్వాతనే తిరిగి మెక్సికో ప్రభుత్వంతో ఒడంబడికలు జరిగాయి. మెక్సికన్ నూనె ఎగుమతి లెక్కలోకి తీసుకోదగినంత పెద్ద ఎత్తున లేదు కాబట్టి అంత ఫరవా లేకపోయింది. కాని, పెర్షియా నూనె విషయం అలాంటిది కాదు. ముఖ్యమైన విషయం ఏమిటంటే, పెర్షియా నూనెమీద మనకు ఎంత లాభం వస్తున్నదని కాదు; పశ్చిమ యూరపు దేశాలకూ, ఇండియా పాకిస్తాన్‌లకూ, ఆ నూనె సరఫరా అయితీరాలి. ఇదిసాధించడానికి మనల్ని ఎదుటివాళ్లు ముక్కునులిపి లాభం వదులుకోమన్నా వదులుకొని తీరాలి. వెనుకబడి ఉన్న ఒక దేశంతో మన నూనె కంపెనీ పెట్టుకున్న సంబంధ బాంధవ్యాలను లేబరు ప్రభుత్వం అంగీకరించినందు వల్లనే పరిస్థితులిలా పరిణమించాయనే అవగాహనతో సోషలిస్టులు తృప్తిచెందాలి-అంతే.

అభివాస్తవికత

# మానవులూ దేవతలే

అట్లూరి లక్ష్మి

గోపి నిద్రలేచేటప్పటికి చాలా ప్రొద్దెక్కింది. ఈ రోజు వాడు ఉదయాన్నే లేవాలనుకున్నాడు. చేయవలసిన పనులు చాలావున్నయ్. పన్నెండు గంటల రైల్లో మామగారి ఊరు వెళ్ళాలి. ఈ రోజు తప్పక రావలసిందని భార్య జానకి దగ్గరనుండి ఉత్తరం వచ్చింది.

ఎక్కడైనా ఓ యాభై రూపాయలు అప్పు తీసికోవాలనుకున్నాడు. ఎవరి దగ్గరకి వెళ్లాలి? మామగారి వూరు వెళ్ళేటప్పుడు జానకికి ఒక మంచి చీర తీసికొని వెళ్ళాలనుకున్నాడు. గుడ్డలకొట్టు షావుకారు యింకేమీ అప్పు యిచ్చే కళలేదు.

బాగా ఆకలిగా వుంది. హోటల్లోకి వెళ్లినప్పుడల్లా అయ్యర్ తనవంక అదో విధంగా చూస్తున్నాడు. ఖాతా ఏభై రూపాయలపై బడిందని తనకూ తెలుసుగా. జేబులోవున్న ఒక రూపాయ మామగారి ఊరుకు రైలు ఖర్చుకు కావాలి. ఏమైతేనేమని ఖాతా హోటలుకే బయలుదేరాడు. హోటలు లోపల పెరుగుతో సహా భోంచేసి బయటకు వచ్చిన గోపీని అయ్యరు మందహాసవదనంతో పలుకరించాడు. అయ్యరుకు ఖాతా పెద్ద మొత్తంగా పెరిగిపోయిందని గుర్తున్నట్టే లేదు. ఎంతో ప్రేమతో, ఉత్సాహంతో మాట్లాడాడు. మీరు మా హోటలుకు రావడమే మాఅదృష్టమన్నట్లు ప్రవర్తించాడు. చిరచిరల్లాడే వాడి వెధవ ముఖంమీద యీనాడెందుకనో యీ మందహాసం?

* * *

అప్పుకోసం ఎవరిదగ్గరకు వెళ్ళాలా, అని ఆలోచిస్తూనే వాడు బట్టల షాపు సమీపించాడు. షాపులోకి వెళ్లడానికి వాడికిష్టం లేదు.

బాకీ రెండు వందల రూపాయలదాకా వుందని వాడి మనస్సులో బాధగా వుంది. అంతలోనే షాపు యజమాని ఎదురై ఎంతో ఆప్యాయంగా ఆహ్వానించాడు. రండి అయ్యా రండి అన్నాడు. కొట్టు లోపలికి వెళ్ళక తప్పలేదు. వెళ్ళగానే షావుకారు "కొత్తరకం జార్జెటు చీరెలు వచ్చినయండీ" అంటూ ఓ పదిచీరెలు ముందు పడేశాడు. బయట పడేటప్పటికి మనవాడిచంకలో ఓ జార్జెటుచీరా, బ్లౌసుపీసూ, మొత్తం అరవై రూపాయల ప్యాకెట్టు తయారైంది. అన్నిటికంటే ఆశ్చర్యకరమైన విషయ మేమంటే. యెప్పుడూ డబ్బుసంగతే ఎత్తే షావుకారు, బాకీ సంగతే యెత్తలేదు. తన షాపులోకి గోపీ వచ్చి చీరకొంటే తను పావనుడైపోతానన్నట్లు ప్రవర్తించాడు షావుకారు. గోపీ ఆశ్చర్యానికి అంతులేదు. అయ్యరులో, షావుకారులో నిగూఢమైయున్న దేవత్వాన్ని యీరోజు వాడు చూడగలిగాడు.

రైలుకు టైమయిందని సరాసరి స్టేషనుకు దారి తీశాడు గోపీ. స్టేషనుదగ్గరకు రాగానే రైలుకూత వినబడింది. త్వరగా స్టేషనులోకి పోయేటప్పటికి రైలు కదలబోతూంది. టికెట్టు సంగతి దేవు డెరుగునను కొని పరుగెత్తి చేతికందిన గువ్వపట్టుకొని పెట్టెలోపలికి దూకాడు. పాపం, ఆ పెట్టెకన్న అగ్నిగుండమే నయం. గుండంలో వాడు నిశ్చింతగా దూకివుండేవాడు.

ఎందుకంటే అది ఒక ఖాళీ ఫస్టుక్లాసు పెట్టె. ఎదురుగా కూర్చునివున్న ఒక్కమనిషీ టికెట్టు కలక్టరు. వాడి పైప్రాణాలు పైనే పోయినయ్.

కాని టికెట్టు కలెక్టరో పెద్దమనిషి. నిజంగా దైవస్వరూపుడు. ఎంతో ఆహ్లాదంతో గోపీని పలుకరించి అనేక సంగతులు మాట్లాడ మొదలెట్టాడు. ఆహార సమస్య, ఆటంబాంబు, ఘర్మోమీజా మొదలైన విషయాలు దొర్లిపోయినాయి. కాని టికెట్టు గొడవే రాలేదు.

మామగారి ఊరు రాగానే గోపీ రైలు దిగాడు. టికెట్టు కలెక్టరును మోసగిస్తున్నానేమోనని వాడి మనస్సు చివుక్కుమన్నది. పరుగెత్తి వెళ్ళి ఆయనకు నిజం చెప్పాలనిపించింది. కాని పోలేదు.

స్టేషను దగ్గరే మామ ఎదురై రెండు చేతులతో ఆహ్వానించాడు. బండి ఎక్కించి ఇంటికి తీసికువెళ్ళి అమిత మర్యాద చేశాడు. మాటల మధ్య ఆయన "నాయనా, నీకు పెళ్ళినాడు యిస్తానన్న అయిదువేల రూపాయిలు యిబ్బందుల వలన ముట్టజెప్పలేకపోయాను. నీవు మరోవిధంగా తలచవద్దు" అంటూనే యింట్లోనుండి అయిదువేల రూపాయిలూ తెచ్చి చేతికిచ్చాడు. తన మామలో ఒక్కసారి ఉద్భవించిన యీ ఔదార్యం, మంచితనం, ధర్మగుణం, దైవత్వం వాడు కళ్ళారా చూచికూడా కలేమో ననుకున్నాడు. ప్రతిమానవునిలో ఏమూలో దాగివుంటుంది కొద్దో గొప్పో పరమాత్మ స్వరూపమైన ధర్మగుణం.

* * *

సాయంకాలం టీ అయింది. టేబిల్ మీద దినపత్రిక పడి ఉంటే తానీ రోజు పేపరు చూడలేదని గుర్తు వచ్చి దానిని విప్పాడు. మొదటిపేజీలో తాటికాయలంతేసి అక్షరాలతో యిలా ఉంది:

"ధనానికి మారకపు విలువలేదు" - భారత ప్రభుత్వ ప్రకటన.

"దేశసౌభాగ్యం కోసం, జీవిత పరిమాణాభివృద్ధికోసం, అధికోత్పత్తికోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్థిక విప్లవం"

"ప్రజలు తమ సుఖానికి పాటుపడాలి" అధ్యక్షుని ఉద్ఘాటన.

క్రింద యీ విధంగా ఉంది.

"భారత ప్రజాజీవితంలో అకస్మాత్తుగా అద్భుతమైన ఒక ఆర్థిక విప్లవం వచ్చింది. ఇక రూపాయి, అణా పైసలకు మన జీవితంలో తావులేదు. ఉత్పత్తి సాధనాలు, తక్కిన జీవిత సాధనాలు, ఇవ్వాళరాత్రి పన్నెండు గంటలకు ప్రభుత్వ ప్రకటనతో ప్రజల పరం అయినాయి.

ఇట్టి విప్లవం వస్తుందని ఎవరూ కలలోనైనా ఎరుగరు. దీని పర్యవసానం..."

('తిండి బాధ, డబ్బు బాధ లేనపుడు మన మందరం దేవతల్లాగ ప్రవర్తించగలం' అన్న నీషే మాట ఆధారంతో.)